సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 2 । జనవరి । 2024


ఇబ్రహీంపట్నం: కేక్ కట్ చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, ఇతర అధికారులు


కడ్తాల్: మైసిగండి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

న్యూస్‌రీల్

నూతన ఎన్నిక


శెట్టి శివకుమార్

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సెంట్రల్ కమిటీ మెంబర్‌గా ఇబ్రహీంపట్నానికి చెందిన శెట్టి శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ కమిటీ చైర్మన్ శివరత్నం, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటోళ్ల సంగమేశ్వర్ తెలిపారు. ఆ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సమర్థవంతంగా పనిచేసిన శివకుమార్‌ను సెంట్రల్ కమిటీ సభ్యుడిగా తీసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శెట్టి శివకుమార్ మాట్లాడుతూ.. ఈ లోక్‌సభ ఎన్నికల లోపు లింగబలిజ కులస్తులను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తమ సంఘం ఆవిర్భవించి పదేళ్లు గడిచిన సందర్భంగా హైదరాబాద్‌లో దశాబ్ది ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నిరంగాల్లో వెనుకబడిన వీరశైవ లింగబలిజలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రభుత్వాలు సహకరించాలన్నారు. సంఘం అభ్యున్నతికి తన శాయశక్తులా కృషిచేస్తానన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ, ఎమ్మెల్యే తదితరులు

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. పట్టణంలోని సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో సోమవారం మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే విధంగా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని సమాజాభివృద్ధి, నిరుపేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

140 మందికి పోలీసు సేవా పతకాలు

సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో రాష్ట్ర పోలీసు విభాగంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి పతకాలను ప్రకటిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన 140 మందికి ఇవి లభించాయి.


మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

కొత్త సందడి

పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాది స్వాగతం చెబుతూ జిల్లా వాసులు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం రాత్రి కేక్‌లు కట్ చేసి.. బాణసంచా కాల్చి సంబరాల్లో మునిగి తేలారు. సోమవారం వేకువజామునే ఆడపడుచులు తమ ఇళ్ల ముందు రంగవల్లులతో సందడి చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కొత్త సంవత్సరం అన్నీ శుభాలు కలగాలని ఆలయాలకు క్యూ కట్టారు. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో దేవాలయాల్లో రద్దీ నెలకొంది.


– సాక్షి, నెట్‌వర్క్


ఆమనగల్లు: ఇంటిముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

‘మెగా’ ఆశలు

తెరపైకి టీచర్ పోస్టుల భర్తీ

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- పుస్తకాలు తిరగేసే పనిలో అభ్యర్థులు
- కోచింగ్ సెంటర్లకు పరుగులు



గత సెప్టెంబర్‌లో విడుదల చేసిన టీఆర్‌టీ నోటిఫికేషన్‌లో చూపిన ఖాళీలు..

జిల్లాపేరు	స్కూల్ అసిస్టెంట్	భాషాపండితులు	పీఈటీలు	ఎస్‌జీటీలు
హైదరాబాద్	116	57	22	163
రంగారెడ్డి	48	25	06	117
మేడ్చల్	25	07	01	45
వికారాబాద్	102	12	-	77

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మెగా డీఎస్సీ ప్రకటన నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆశలు చిగురింపజేస్తోంది. ఆరేళ్లుగా ఉపాధ్యాయ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఫలితంగా ఖాళీల సంఖ్య భారీగా పెరిగిపోయింది. తాజాగా ప్రభుత్వం మెగా డీఎస్సీ అంశాన్ని తెరపైకి తేవడంతో ఇప్పటికే బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసి.. ఏళ్ల తరబడి ప్రభుత్వ నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు మళ్లీ పుస్తకాలను తిరగేసే పనిలో పడ్డారు. ఎలాగైనా ఈసారి జాబ్ చేజిక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. సీఎంల పైరవీల ద్వారా అడ్డదారుల్లో, అక్రమంగా ఇక్కడికి వచ్చిన వారిని తిప్పి పంపడం ద్వారా ఏర్పడిన ఆయా ఖాళీలను డీఎస్సీ ద్వారా మళ్లీ భర్తీ చేయొచ్చనే భావనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

20 వేలకుపైగా నిరుద్యోగులు

రంగారెడ్డి జిల్లాలో 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో ప్రస్తుతం 6,919 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 2017 తర్వాత ఇప్పటి వరకు ఉపాధ్యాయ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ వెలువడలేదు. జిల్లాలో బీఈడీ, డీఈడీ కోర్సులు పూర్తి చేసిన వారు 20 వేల మందికి పైగా ఉన్నట్లు అంచనా. వీరంతా ఏళ్ల తరబడి నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ తాజా ప్రకటనతో మళ్లీ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటి వరకు చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలకు సెలవు పెట్టి పరీక్షకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు జిల్లాలో 4,722 మందికిపైగా ఉపాధ్యాయులు ఏళ్ల తబడి ఒకేచోట పని చేస్తున్నట్లు సమాచారం. వీరంతా ఇప్పటికే బదిలీ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ మధ్య లోనే నిలిచిపోయింది. 317 జీఓకు విరుద్ధంగా 400 మందికిపైగా స్థానికేతరులు జిల్లాలోనే ఉన్నారు. వీరందరినీ ఆయా సొంత జిల్లాలకు తిప్పి పంపడం ద్వారా మరిన్ని ఖాళీలను సృష్టించి, స్థానిక నిరుద్యోగులతో వాటిని భర్తీ చేసే అవకాశాన్ని సైతం ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

టీఆర్‌టీ దరఖాస్తులపై లేని స్పష్టత

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మొదట్లో డీఎస్సీ (డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ) నిర్వహించేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డీఎస్సీని రద్దు చేసి, దాని స్థానంలో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్‌టీ) తీసుకొచ్చింది. గత సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో మొత్తం 823 పోస్టులను ఖాళీగా చూపించింది. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూలు అసిస్టెంట్లు, పీఈటీ, భాషా పండితుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొంది. హైదరాబాద్ జిల్లా పరిధిలో 358 పోస్టులు, మేడ్చల్ జిల్లా పరిధిలో 78, రంగారెడ్డి జిల్లా పరిధిలో 196, వికారాబాద్ జిల్లా పరిధిలో 191 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించింది. వాస్తవ ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్‌లో చూపించిన పోస్టులకు పొంతనే లేకుండాపోయింది. అడ్డదారుల్లో వచ్చిన ఉపాధ్యాయులను తిప్పి పంపడం ద్వారా ఏర్పడే ఖాళీలను కూడా భర్తీ చేసే ఆలోచన ఉంది. అయితే, ఇప్పటికే టీఆర్‌టీ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుని, పరీక్ష కోసం ఎదురు చూస్తున్న వారు మళ్లీ కొత్త ప్రభుత్వం ప్రకటించే డీఎస్సీ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది.

‘సేవ్ రంగారెడ్డి’

జీఓ 317తో జిల్లాకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తొర్రూరులోని క్యాంప్ ఆఫీసులో కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అంజేశారు. 317 జీవో అడ్డుపెట్టుకొని జిల్లాకు వచ్చిన ఇతర జిల్లాల ఉపాధ్యాయులతో స్థానిక ఉపాధ్యాయులకు పదోన్నతుల్లోనే కాదు బదిలీల్లోనూ తీవ్రమైన అన్యాయం జరిగిందని, రూల్ ఆఫ్ రిజర్వేషన్లు పాటించకపోవడంతో రిజర్వేషన్ వర్గాలు వారి రిజర్వేషన్లలో ప్రమోషన్లు నష్టపోతున్నారని, స్థానిక జిల్లా నిరుద్యోగులు శాశ్వతంగా ఉద్యోగం కోల్పోయే పరిస్థితి వచ్చిందని విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

అంబేడ్కర్ మార్గంలో పయనించాలి

డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్


మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

కందుకూరు: అంబేడ్కర్ మార్గంలోనే మాదిగలు నడవాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పిలుపునిచ్చారు. మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర కో–కన్వీనర్ భీమ్‌రావు మహారాజ్ చేపట్టనున్న 24 వేల కిలోమీటర్ల మహా కాలినడక కార్యక్రమ ప్రారంభ సభను సోమవారం రాత్రి మండల పరిధిలోని లేమూరులో నిర్వహించారు. ఈ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంబేడ్కర్ తత్వజ్ఞానం ఆది జాంబవ చరిత్రను మాదిగలందరికీ తెలియజేయడానికి మహా కాలినడక చేపట్టడం గొప్ప విషయమన్నారు. నాలుగేళ్లలో సంవత్సరానికి ఆరు వేల కిలోమీటర్ల చొప్పున 24 వేల కిలోమీటర్లు కాలినడక కొనసాగించాలనుకోవడం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ విషయమని కొనియాడారు. భీమ్‌రావు మహారాజ్ మాట్లాడుతూ.. ఆదిజాంబవంతుడ్ని నిత్యం స్మరించుకుంటూ మహా కాలినడకను కందుకూరు మండలంలో ప్రారంభించి 24 వేల కిలోమీటర్లు పూర్తి చేసి చివరికి ఇక్కడే ముగిస్తానన్నారు. మాదిగల్లో ఉన్న ఆత్మన్యూనత భావాన్ని తీసివేసి మహారాజ్ అనే గొప్ప స్వభావం తీసుకురావడం కోసమే ఈ పాదయాత్ర అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మాదిగ కాలనీలకు ఈ పాదయాత్ర చేరుతుందన్నారు. అనంతరం మహా కాలినడకను ప్రాంరంభించి లేమూరులోని మాదిగ కాలనీకి మహారాజ్‌ల కాలనీ బోర్డును ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. అక్కడి నుంచి గూడూరు, కందుకూరు గ్రామాల వైపు కాలినడక యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ అంజయ్యమహారాజ్, కె.రవీందర్ మహారాజ్, వివిధ జిల్లాల ఎంజేఎస్ కన్వీనర్లు యాదగిరి, బి.సుధాకర్, వెంకటేశ్, వెంకట్, రవిచంద్రన్, రవికాంత్, లేమూరు ఎంజేఎస్ పెద్దలు చిన్నగళ్ల ఆంజనేయులు, చింతకింది బాల్‌రాజ్, గుల్వి మహిపాల్, నరేష్, డీఎస్‌పీ నాయకుడు అమరేందర్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ ఠాణాకు జాతీయ స్థాయి గుర్తింపు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దేశంలోని పోలీస్‌స్టేషన్లను పలు అంశాల్లో ప్రామాణికంగా తీసుకొని జాతీయ స్థాయిలో ర్యాంకింగ్‌ను అందిస్తోంది. ఇప్పటికే రెండు దఫాలుగా కేంద్ర బృందం రాజేంద్రనగర్ ఠాణాను సందర్శించి వివరాలను సేకరించింది. ఈ నెల 5న జైపూర్‌లో నిర్వహించనున్న డీజీపీల సదస్సులో ర్యాంకింగ్‌ను కేంద్రం ప్రకటించనుంది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌కు ఆదివారం ఆహ్వానం అందింది. జాతీయ స్థాయిలో 1–10 ర్యాంకులను ప్రతి సంవత్సరం పోలీస్‌స్టేషన్లకు అందిస్తుంటారు. ఇందులో కేసులను త్వరితగతిన పరిష్కరించడం, స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, స్టేషన్‌కు వచ్చే వారితో సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు, కౌన్సెలింగ్, మిస్సింగ్, గుర్తు తెలియని మృతదేహాలకు సంబంధించిన పూర్తి వివరాలు, పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహార తీరు తదితర అన్ని ఈ ప్రామాణికంలో తీసుకొని ర్యాంకింగ్ ఇస్తారని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు. 1–10 ర్యాంకుల్లో స్టేషన్‌కు అవార్డు రానుందని వెల్లడించారు. 5న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఈ అవార్డును అందిస్తారన్నారు.

‘కొత్త’ బాటలో బల్దియా!

- ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులు
- నిధులొస్తే ఎస్సార్‌డీపీ రెండో దశ



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలో కొత్త సంవత్సరం జీహెచ్ఎంసీలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. గత సంవత్సరం నవంబర్ వరకు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ స్థానే కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వ ప్రాధాన్యతలేమిటో ఇంకా వెల్లడికాలేదు. జీహెచ్ఎంసీకి సంబంధించిన మునిసిపల్ పరిపాలన శాఖను స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుండటంతో ఆయన అంచనాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా పనులు చేయనున్నారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వివిధ సేవలందాలని భావిస్తున్న సీఎం.. పౌరసేవలు మెరుగుపరచడం, ఫిర్యాదుల పరిష్కారం వంటివాటికి ప్రాధాన్యం ఇస్తారని చెబుతున్నారు. అందుకనుగుణంగా సిటిజెన్ చార్టర్‌ను అమలు చేసే పరిస్థితులొస్తాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రాజెక్టులెలా..

ఇక వివిధ ప్రాజెక్టుల పనులు కొనసాగిస్తారా.. లేక కొత్తవి తెరపైకి వస్తాయా అనే చర్చ జరుగుతున్నప్పటికీ, ఇప్పటికే పనులు మొదలై పురోగతిలో ఉన్న వాటిని నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. కొత్తవాటిపైనే వేచి చూస్తున్నారు. అంతేకాదు..టెండర్లు పూర్తయిన పనుల్నీ చేపట్టనున్నారు. వరదముంపు నివారణలో భాగంగా మూసీపై బ్రిడ్జి పనుల్ని వర్షాకాలంలోగా పూర్తి చేయాల్సి ఉండటంతో ఆ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే మూసారాంబాగ్ వద్ద పనులకు శ్రీకారం చుట్టారు. అత్తాపూర్, ఫతుల్లాగూడ, సన్‌సిటీ వద్ద కూడా పనులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఫలానా పనులొద్దనే ఆదేశాలు వస్తే తప్ప.. యథావిధిగా చేస్తామని అధికారులు చెబుతున్నారు.

జీతాలకే తిప్పలు..

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్సార్‌డీపీ) కింద వివిధ ఫ్లైఓవర్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఆర్‌యూబీలు తదితరమైన వాటి కోసం రూ.4,305 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే అనుమతుల కోసం పంపించారు. వాటికి నిధులు మాత్రం జీహెచ్ఎంసీ వద్ద లేవు. ఎస్సార్‌డీపీ మొదటి దశ పథకానికి తీసుకున్న అప్పులతోనే జీహెచ్ఎంసీ ఖజానా ఖాళీగా ఉంటోంది. అప్పుల చెల్లింపులతో నెలనెలా జీతాలకే నానా తిప్పలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులిస్తే తప్ప ఆ పనులు చేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తే కానీ ఈ పనుల భవిష్యత్ వెల్లడి కాదు.

రెండో దశ పనుల్లో..

ఎస్సార్‌డీపీ రెండో దశ పనుల్లో విప్రో జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ (రూ.106 కోట్లు), కూకట్‌పల్లి వై జంక్షన్ వద్ద అమీర్‌పేట, మియాపూర్ వైపు వెళ్లే ఫ్లై ఓవర్లు (రూ.180 కోట్లు) నిర్మించాలి. అలాగే రేతిబౌలి, నానల్‌నగర్‌ల వద్ద మల్టీ లెవెల్ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ (రూ.250 కోట్లు), ఈసీఐఎల్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ (రూ.165 కోట్లు), రాధికా జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ (రూ.150 కోట్లు), పాతబస్తీలో ఒమర్ హోటల్ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్(రూ.170 కోట్లు), బండ్లగూడ జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ (రూ.105 కోట్లు), బెంగళూర్ హైవే– శాస్త్రిపురం జంక్షన్, శాస్త్రిపురం జంక్షన్– ఇంజిబౌలి రహదారుల విస్తరణలు (రూ.400 కోట్లు) తదితరమైనవి ఉన్నాయి.

ఆరంభం అదిరింది!



ప్రశాంతంగా ప్రారంభమైన కొత్త ఏడాది

- ‘డిసెంబర్ 31’ బందోబస్తు విజయవంతం
- తనిఖీల్లో చిక్కిన 3,001 మంది డ్రంక్ డ్రైవర్లు
- పట్టుబడిన వారిలో మహిళలు, ట్రాన్స్‌జెండర్లు


కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్న సీపీ శ్రీనివాస్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ... ఈ ‘ముగ్గురు పోలీసులు’ ఏర్పాటు చేసిన బందోబస్తు.. విధించిన ఆంక్షలు ఫలితాలనిచ్చాయి. కొత్త సంవత్సర స్వాగత వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరిగాయి. మొత్తంమీద ఒక్క ప్రమాదం కూడా నమోదు కాకుండా జీరో యాక్సిడెంట్ నైట్‌గా చేయడంలో సిటీ పోలీసులు సఫలీకృతులయ్యారు. నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఉన్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పరిస్థితిని పర్యవేక్షించారు. స్థానిక పోలీసులతో పాటు అదనపు బలగాలూ ఆదివారం రాత్రంతా విధుల్లోనే ఉన్నాయి. నగరంలోని కీలక ప్రాంతాలతో పాటు ఇన్నర్/ఔటర్ రింగ్ రోడ్లలోనూ నిరంతరం ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు. వేడుకలు నిర్వహించే, జరుపుకొనే వారు సైతం ఇతరులకు ఇబ్బందులు కలుగజేయకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ విభాగాల అధికారులు మద్యం తాగి వాహనాలు నడపడం, దురుసుగా డ్రైవింగ్ చేయడం, మితిమీరిన వేగం, పరిమితికి మించి వాహనాలపై ప్రయాణించడం తదితర ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించారు. మొత్తం మీద మూడు కమిషనరేట్లలోనూ కలిపి 3,001 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. గతంలో జరిగిన ప్రమాదాలు, ఘటనల్ని దృష్టిలో పెట్టుకున్న పోలీసులు ముందు జాగ్రత్తగా దాదాపు అన్ని ఫ్లైఓవర్లను బంద్ చేశారు. ప్రత్యామ్నాయ మార్గం లేని కారణంగా బేగంపేట, డబీర్‌పుర వంటి కొన్ని ఫ్లైఓవర్లకు మాత్రమే మినహాయింపునిచ్చారు. నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ మార్గ్‌తో పాటు హుస్సేన్‌సాగర్ చుట్టుపక్కల వాహనాలు అనుమతించలేదు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వేలోనూ కొన్ని ఆంక్షలు కొనసాగాయి. కమిషనరేట్లలోని ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు వాహనచోదకుల వేగాన్ని నియంత్రించారు. పోలీసులు, ట్రాఫిక్ విభాగం అధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా డిసెంబర్ 31 ప్రశాంతంగా పూర్తయింది. సోమవారం తెల్లవారుజాము 2 గంటల తరవాత ఫ్లైఓవర్లు, 3 గంటలకు ట్యాంక్‌బండ్, 5 గంటలకు నెక్లెస్‌రోడ్డులో సాధారణ ట్రాఫిక్‌ను అనుమతించారు. నూతన సంవత్సర వేడుకలతో ఐటీ కారిడార్ హోరెత్తింది. పదుల సంఖ్యలో ఈవెంట్లు నిర్వహించడంతో వేల సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు.

తాగేశారు... తోలేశారు!

పోలీసు విభాగం ఎన్ని సూచనలు చేసినా.. ఎంతగా హెచ్చరించినా... మందుబాబులు మాత్రం మారలేదు. డిసెంబర్ 31 నేపథ్యంలో ఆదివారం రాత్రి మద్యం తాగి అనేక మంది వాహనాలు నడిపేశారు. ఈ నేపథ్యంలో మూడు కమిషనరేట్లలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 3,001 కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా హైదరాబాద్ కమిషరేట్ పరిధిలోనే 1,243 మంది చిక్కారు. సైబరాబాద్‌లో 1,241 మంది, రాచకొండలో 517 మంది పట్టుబడ్డారు. వీరిలో ద్విచక్ర వాహనచోదకులే ఎక్కువ మంది ఉన్నారు. ఆదివారం రాత్రి 9 నుంచి సోమవారం తెల్లవారుజాము 4 గంటల వరకు తనిఖీలు నడిచాయి. చిక్కిన మందుబాబుల నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి కుటుంబం సభ్యుడు లేదా సంరక్షకుడి సమక్షంలో మంగళ–బుధవారాల్లో ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆపై వీరిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. పట్టుబడిన మొత్తం 3,001 మందిలో నలుగురు మహిళలు ఉండగా వీరు హైదరాబాద్, సైబరాబాద్‌ల్లో ఇద్దరు చొప్పున చిక్కారు. నగరంలో ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు (నల్లకుంట, మలక్‌పేటల్లో), 13 మంది మైనర్లు సైతం చిక్కారు.

డ్రంక్ డ్రైవింగ్ చేస్తూ చిక్కిన మందుబాబుల గణాంకాలు .. వాహనాల వారీగా...

ద్విచక్ర వాహనచోదకులు	త్రిచక్ర వాహనదారులు	తేలికపాటి వాహనాలు	భారీ వాహన చోదకులు
2,435	73	486	7

పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు
2,995	4	2

18 ఏళ్లలోపు వారు	60 ఏళ్లు పైబడినవారు	మిగిలిన వయస్కులు
13	19	2,969

లిక్కర్ కిక్కు

- 4.5 లక్షల కేసుల లిక్కర్...
- 1.17 లక్షల కేసుల బీర్ల విక్రయాలు

నూతన సంవత్సరం సందర్భంగా గ్రేటర్‌లో మద్యం ఏరులైపారింది. పబ్బులు, క్లబ్బులు, బార్‌లు, న్యూఈయర్ ఈవెంట్‌లలో లిక్కర్ భారీ కిక్కునిచ్చింది. మందేసి, చిందేస్తూ కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. ఎక్సైజ్‌శాఖ లెక్కల ప్రకారం డిసెంబర్ 29 నుంచి 31 వరకు తెలంగాణ అంతటా సుమారు రూ.650 కోట్ల మద్యం అమ్మకాలు జరిగితే ఒక్క గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లోనే రూ.450 కోట్ల మద్యం విక్రయించినట్లు అంచనా. మరోవైపు గ్రేటర్‌లోని మూడు జిల్లాల్లో రంగారెడ్డి మొదటి స్థానంలో ఉంది. 70 శాతానికి పైగా మద్యం అమ్మకాలు ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నట్లు అంచనా. సుమారు 4.5 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడైంది. మరో 1.17 లక్షల కేసులకు పైగా బీర్ల విక్రయాలు జరిగాయి. 31వ తేదీ కంటే డిసెంబర్ 30న మద్యం ఎక్కువ అమ్ముడైనట్లు అధికారులు అంచనా వేశారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

త్వరలో తాపీ మేస్త్రీ సంఘం భవన నిర్మాణం

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఆయన తాపీ మేస్త్రీ సంఘం షాద్‌నగర్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తాపీ మేస్త్రీ సంఘం భవన నిర్మాణానికి త్వరలో స్థలం సమకూర్చి, భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు తాపీ మేస్త్రీలు చేసిన కృషి మరువలేనిది అన్నారు. ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాబర్‌ఖాన్, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాలరాజు, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యేకు సన్మానం

షాద్‌నగర్ ముదిరాజ్ మహాసభ నాయకులు సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిశారు. ఈసందర్భంగా వీర్లపల్లి శంకర్‌కు నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం తాలుకా అధ్యక్షుడు అంచ రాములు, శ్రీధర్ వర్మ, గిరిబాబు, అశోక్, మధు, వాసు, అజయ్‌వర్మ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో తపస్ నాయకులు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి 'తపస్' వినతి

చేవెళ్ల: పాఠశాలలో ఉపాధ్యాయుల, స్కావేంజర్ నియామకం, జీఓ 317 సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డిని కోరారు. సోమవారం నగరంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆయనను కలిసిన తపస్ జిల్లా సంఘం నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. జీఓ 317, పాఠశాల్లో స్కావెంజర్ నియామకం గురించి, గత ప్రభుత్వం జారీ చేసిన హెల్త్‌కార్డ్స్ జీఓను అమలు, ఎఫ్ఆర్ఎస్ విధానం వలన రోజు విద్యార్థుల ఫొటోలు తీయడం ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిందని దీనిని రద్దు చేయాలని, ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి తొలగించుట తదితర అంశాలను ఆయనతో చర్చించారు. కౌన్సిల్‌లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుటకు కృషి చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఘనపురం సురధీర్, జిల్లా అధ్యక్షుడు కాశీరావు, ప్రధాన కార్యదర్శి రమేశ్, జిల్లా కోశాధికారి దూత కృష్ణ, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, చేవెళ్ల మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు లక్ష్మీప్రసాదవ్, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన 'బుల్లెట్'

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఇబ్రహీంపట్నం: బుల్లెట్ బైక్ అదుపుతప్పి కింద పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. కందుకూరు మండలం దావూద్‌గూడ గ్రామానికి చెందిన రత్లావత్ అనిల్ కుమార్ (27) ఆదివారం సాయంత్రం ఆరు గంటల సమయంలో ఎల్‌బీ నగర్ వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు మీదగా ఇంటికి వెళ్తుండగా బొంగుళూరు గ్రామ పరిధిలోని ఎయిరో సిటీ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. దీంతో తలకు, ముఖానికి బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి

ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన



మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేశంపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన జూకట్ల నర్సింలు(48) అనారోగ్యానికి గురి కావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని దివ్య ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయనకు వైద్యులు సైనసైటీస్ సర్జరీ చేయాలని రూ.లక్ష తీసుకున్నారు. సర్జరీ అయ్యాక పరిస్థితి విషమించడంతో వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అప్పటికే ఆయన చనిపోయాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంగా కారణంగానే నర్సింలు మృతి చెందాడని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వైద్యులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన చేస్తున్న బంధువులకు సర్ది చెప్పి పంపించారు.

ఆరు పబ్‌లపై కేసుల నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరు పబ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. లైసెన్స్ అనుమతులు లేకుండా నడుపుతున్న రోడ్ నెంబర్ 45లోని హాలో, రోడ్ నెంబర్-10లోని తారో సబ్‌లతో పాటు శబ్ద కాలుష్యానికి పాల్పడినందుకు గాను రోడ్డునెంబర్-37లోని మాకో, రోడ్ నెంబర్-36లోని క్సేనా పబ్‌లపై కేసులు నమోదు చేశారు. వీటిలో నిర్ణీత సమయం దాటినప్పటికీ పబ్ నిర్వహిస్తున్న గ్రీస్‌మంకీ, లుఫ్ట్ పబ్‌లపై కూడా కేసులు నమోదు చేశారు.

పన్నుల వసూలుపై నజర్

టార్గెట్ రూ.1.37 కోట్లు

- వసూలైనవి రూ.60లక్షలు
- మార్చి 15లోగా వందశాతం పూర్తి చేసేందుకు కసరత్తు
- పంచాయతీల మెడపై విద్యుత్ బిల్లుల కత్తి

యాచారం: పన్నుల వసూళ్లపై అధికారుల ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే పన్నులతోనే గ్రామాల్లోని సమస్యల పరిష్కారం, సిబ్బందికి జీతాలు, వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. మండల పరిధిలోని 24 పంచాయతీల్లో ఒక్కో పంచాయతీల్లో పన్నుల టార్గెట్ రూ.లక్ష నుంచి రూ.10 లక్షలకు పైగానే ఉంది. 2023-24కు సంబంధించి రెండు నెలల క్రితమే పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి పన్నుల నోటీసులు పంపిణీ చేశారు. నూతన పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం ప్రతీ ఏడాది డిసెంబర్ లోపే గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. డిసెంబర్‌లో వసూలయ్యే పన్నులపై ఆధారపడే ఈ ఏడాది ఖర్చులకు సంబంధించి ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. పంచాయతీల్లో మార్చి 31 వరకు వంద శాతం పన్నుల టార్గెట్‌గా నిర్ణయించుకుని వసూళ్లకు కృషి చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరమే పన్నుల వసూళ్లపై ప్రాముఖ్యత ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వసూలయ్యే పన్నులతోనే పరిపాలన సాగుతోంది. పంచాయతీ సిబ్బంది జీతభత్యాలు అందిస్తున్నారు.



గడ్డమల్లయ్యగూడ పంచాయతీ కార్యాలయం

మేజర్ గ్రామాల్లో విస్తరిస్తున్న వ్యాపారం

మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల శాతం గణనీయంగా పెరిగింది. యాచారం, గునుగల్, నందివనపర్తి, తక్కళ్లపల్లి, చింతపట్ల, మాల్, నక్కర్తమేడిపల్లి, నస్దిక్‌సింగారం, చింతుల్ల, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. దీంతో నిర్మాణాలు పెరిగి పన్నుల శాతం గణనీయంగా పెరుగుతుంది. నందివనపర్తి గ్రామంలో గంటా కంపెనీ, గునుగల్ గ్రామంలో తిరుమల డెయిరీ, యాచారం గ్రామంలో రైలు మిల్లులు, మాల్, యాచారం గ్రామాల్లో వ్యాపార దుకాణాలు, హోటళ్లు నిర్మితమయ్యాయి. గ్రామాల్లోనూ ఇళ్ల నిర్మాణాలు పెరగాయి. నక్కర్తమేడిపల్లి, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో పౌల్ట్రీఫాంలు వెలుస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో పరిశ్రమలు, నిర్మాణాలు పెరుగుతున్నా ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో ఏర్పాటవుతున్నా పరిశ్రమలకు సరైన మెజర్‌మెంట్ చేయకపోవడం, వ్యాపారులతో కుమ్మక్కు కావడంతో పంచాయతీలకు వచ్చే ఆదాయం ప్రజాప్రతినిధులు జేబులోకి వెళ్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

స్పెషల్ డ్రైవ్ నిర్వహణకు యత్నం

2023-24 ఏడాదికి రూ.1,37,86,386 పన్నుల టార్గెట్ ఉండగా రూ.60,00,259 పన్నులు వసూలయ్యాయి. మేజర్ గ్రామాలైన మాల్, నందివనపర్తి, యాచారం, గునుగల్, మాల్, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి తదితర గ్రామాల్లో పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. మార్చి 30లోపు వంద శాతం పన్నులు వసూళ్లు చేసేందుకు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఉమారాణి పర్యవేక్షిస్తున్నారు. పన్నుల వసూళ్లు, చెల్లింపులపై ప్రజాప్రతినిధులు, ప్రజలతో సమావేశమవుతూ చైతన్యం చేస్తున్నారు. ఇందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు, ప్రజా పాలన తదితర ప్రభుత్వ కార్యక్రమాలతో పంచాయతీ సిబ్బంది బిజీగా ఉండడంతో పన్నుల వసూళ్లపై దృష్టి సారించలేకపోతున్నారు.

పేరుకుపోతున్న విద్యుత్ బకాయిలు

కేసీఆర్ సర్కార్ హయాంలో ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు ఎటువంటి నిధులు మంజూరవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే వివిధ ఆర్థిక పద్దుల నిధులతోనే పంచాయతీల నిర్వాహణ కొనసాగుతోంది. పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు అప్పట్లో బీఆర్ఎస్ సర్కార్‌లోని మంత్రులను, కలెక్టర్లను కోరిన స్పందన కరువైంది. పంచాయతీల్లో విద్యుత్ లైట్లు, బోరు మోటార్లు వినియోగానికి రూ.వేలల్లో విద్యుత్ బాకాయిలుంటున్నాయి. 2023కు గాను రూ. 57,30,265 బిల్లులు వచ్చాయి.

రూ.10 లక్షల అప్పు



గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు, సిబ్బంది జీతాలకు రూ.10లక్షలు అప్పు చేశా. ఏడాది నుంచి పంచాయతీకి పైసా నిధులు రాలే. పంచాయతీ నిర్వాహణ భారంగా మారింది. పన్నులు వసూలు చేస్తేనే సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి ఉంది. కొత్త ప్రభుత్వమైనా పెండింగ్ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి. పదవీ కాలం ముగిసే వరకైనా వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నాం.

– కాలె సంతోష, సర్పంచ్, తమ్మలోనిగూడ

విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలి



పంచాయతీల్లో విద్యుత్ బిల్లులు, బోరుమోటార్ల వాడకం కోసం ఖర్చు అయ్యే విద్యుత్ వినియోగానికి సంబంధించి బిల్లులను ప్రభుత్వమే భరించాలి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధుల ద్వారా పంచాయతీల నిర్వాహణ కొనసాగుతుంది. నెలకు రూ.50వేలకు పైగా విద్యుత్ బిల్లు వస్తుంది. చెల్లించేది ఎలా. నిధులు రావు. చెల్లింపులు అధికం కావడంతో నిర్వాహణ భారంగా మారింది. ప్రభుత్వం విద్యుత్ బిల్లులను మాఫీ చేయాలి.

– ముదిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్, యాచారం

వంద శాతం పన్నులు



మార్చి 15 లోపే వంద శాతం పన్నులు వసూలు చేయాలి. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం డిసెంబర్ లోపే వంద శాతం పన్నులు వసూల చేయాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికలు, ప్రజాపాలన తదితర ప్రభుత్వ కార్యక్రమాల వల్ల పన్నుల వసూళ్లపై పూర్తి స్థాయి దృష్టి పెట్టలేకపోతున్నాం. విద్యుత్ బిల్లులు మాఫీపై ప్రభుత్వానికి తెలియజేస్తాం. నిధులు ఉన్న పంచాయతీలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తేనే మంచిది.

– విజయలక్ష్మి, ఎంపీడీఓ, యాచారం

కరాటే పోటీల్లో సత్తా చాటిన మహేశ్



తలకొండపల్లి: ఢిల్లీలో గోల్డ్ మెడల్ అందుకున్న మహేశ్

- అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్
- సతీశ్‌కు సిల్వర్

తలకొండపల్లి: ఢిల్లీలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని కరాటే మాస్టర్ మహేశ్ గోల్డ్ మెడల్ సాధించాడు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన మహేశ్ మాస్టర్ కరాటే అకాడమీలో శిక్షణ ఇస్తున్నాడు. ఈ శిక్షణ తీసుకున్నవారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. 2023 డిసెంబర్ 31న ఢిల్లీ తాజ్ హోటల్‌లో నిర్వహించిన పోటీల్లో నేపాల్, జపాన్, మలేషియా, ఆఫ్గానిస్తాన్ తదితర దేశాల నుంచి 300 మంది పాల్గొనగా మన రాష్ట్రం నుంచి ముగ్గురు తలపడ్డారు. మహేశ్ ఫైట్‌లో గోల్డ్ మెడల్, కటాఫ్‌లో సిల్వర్ మెడల్స్‌ను సాధించాడు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయి కరాటే నిర్వాహకులు మహేశ్‌కు మెడల్స్, ప్రశంసా పత్రం, సర్టిఫికెట్‌లను అందజేసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అకాడమీ ఆర్గనైజర్ సుజీత్ చారి, బ్లాక్ బెల్టు సతీశ్, కలర్ బెల్టు అంజలి, మాస్టర్స్, తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: సతీశ్‌ను అభినందిస్తున్న కేశవ్ అకాడమీ నిర్వాహకులు

సీనియర్ బ్లాక్ బెల్ట్ స్పైరింగ్ విభాగంలో సిల్వర్ మెడల్

కడ్తాల్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన మాస్టర్ సతీశ్ సిల్వర్ మెడల్ సాధించాడు. కేశవ్ అకాడమీలో కోచ్‌గా పనిచేస్తున్న సతీశ్ అంతర్జాతీయ స్థాయి సీనియర్ బ్లాక్ బెల్ట్ స్పైరింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సతీశ్‌ను అకాడమీ ఫౌండర్ కేశవ్, పలువురు కరాటే మాస్టర్లు అభినందించి సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉప్పల్: రెండు బైక్‌లు ఎదురుఎదురుగా ఢీ కొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మాసబ్ ట్యాంక్ ప్రాంతానికి చెందిన కుమార స్వామి (45) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి రామంతాపూర్‌లోని స్నేహితుడు వద్దకు వచ్చిన అతను అర్ధరాత్రి ఇంటికి తిరిగి వెళ్లేందుకు బయలుదేరాడు. అదే సమయంలో రామంతాపూర్ డీమార్ట్ వద్ద బైక్‌పై ఎదురుగా వచ్చిన జగిత్యాలకు చెందిన రోహన్ ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా, చిక్సిత్స పొందుతూ కుమారస్వామి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా డ్రగ్ పెడ్లర్ అరెస్ట్

- పోలీసుల అదుపులో మరో నలుగురు విద్యార్థులు
- 8 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

చాదర్‌ఘాట్: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని డ్రగ్స్ విక్రయిస్తున్న మహిళా పెడ్లర్ సహా ఐదుగురు వ్యక్తులను సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెడ్లర్ నుంచి 8 గ్రాముల ఎండీఎంఏ (అంఫెటమిన్) డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చాదర్‌ఘాట్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ వివరాలు వెల్లడించారు. సంతోష్‌నగర్ కాలనీకి చెందిన అయేషా ఫిర్దోస్ ముంబైలో డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చి అవసరమైన వారికి సరఫరా చేసేది. నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో ముంబై వెళ్లిన ఆమె 8 గ్రాముల ఎండీఎంఏ (అంఫెటమిన్) డ్రగ్‌ను తీసుకు వచ్చింది. సైదాబాద్‌కు చెందిన నలుగురు విద్యార్థులకు డ్రగ్స్‌ను విక్రయించేందుకు సోమవారం నల్గొండ చౌరస్తా వద్ద తచ్చాడుతుంది. దీనిపై సమాచారం అందడంతో సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, చాదర్‌ఘాట్ పోలీసులతో కలిసి దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె నుంచి 8 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో సైదాబాద్‌కు చెందిన విద్యార్థులు కిజారుద్దీన్ అనాస్, మహ్మద్ అర్బాన్, అయాజ్‌ఖాన్, షాబాజ్ షరీఫ్‌లను సైతం అరెస్ట్ చేశారు. సమావేశంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ వై.ప్రకాష్‌రెడ్డి, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్, సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడి దుర్మరణం



అరుణ్‌కుమార్ (ఫైల్)

భాగ్యనగర్‌కాలనీ: మద్యం మత్తులో కారు నడుపుతున్న ఓ వ్యక్తి ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేములవాడ మాల్యాల గ్రామానికి చెందిన నేదూరి అరుణ్‌కుమార్ (33) మోతీనగర్‌లో నివాసం ఉంటూ పాలు విక్రయించే ఏజెన్సీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మియాపూర్ వెళుతుండగా మియాపూర్ లింక్ రోడ్డులో మద్యం మత్తులో కారు నడుపుతున్న మిత్రహిల్స్‌కు చెందిన ముత్యాల దినేష్ డివైడర్‌ను కొట్టడంతో కారు అదుపుతప్పి అరుణ్‌కుమార్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేపీహెచ్‌బీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన దినేష్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మద్యం తాగినట్లుగా గుర్తించి అతడిపై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని మరొకరు...

బాలానగర్: బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ భాస్కర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సాయినగర్‌కు చెందిన కె. దుర్గయ్య (58) అమీర్‌పేటలో హౌస్ కీపింగ్ పనేసేవాడు. ఆదివారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా మెజిస్టిక్ గార్డెన్ ముందు వేగంగా వచ్చిన బైక్ అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దుర్గయ్య ను హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికులు ప్రమాదానికి కారణమైన మల్లిఖార్జున్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతను ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నట్లు గుర్తించారు. దుర్గయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిర్యానీ విషయంలో గొడవ

- ఇరువర్గాల మధ్య ఘర్షణ
- అబిడ్స్ గ్రాండ్ హోటల్ వెయిటర్లు, యజమానిపై కేసు నమోదు
- పోలీసుల అదుపులో నిందితులు

అబిడ్స్: బిర్యానీ విషయంలో చోటు చేసుకున్న వాగ్వాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసిన సంఘటన అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అబిడ్స్ గ్రాండ్ హోటల్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..నూతన సంవత్సరం సందర్భంగా ధూల్‌పేట్ గంగాబౌలికి చెందిన ఎనిమిది మంది ఆదివారం రాత్రి అబిడ్స్ గ్రాండ్ హోటల్‌కు వచ్చారు. మటన్ బిర్యానీతో పాటు పలు రకాల వంటకాలను ఆర్డర్ చేశారు. వెయిటర్స్ మటన్ బిర్యానీ తీసుకురాగా అది సరిగ్గా ఉడకలేదని, చల్లగా ఉందని వారు వాపస్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వెయిటర్లు అదే బిర్యానీని వేడి చేసుకుని తీసుకువచ్చారు. దీంతో వారు బిర్యానీతో ఇతర వంటకాలను తిన్నారు. అయితే మటన్ బిర్యానీ మాత్రం తాము డబ్బులు చెల్లించమని, మటన్ ఉడకనప్పుడు ఎందుకు చెల్లించాలని వెయిటర్స్‌ను నిలదీశారు. మిగతా పైసలు చెల్లిస్తామని, మటన్ బిర్యానీ డబ్బులు మాత్రం చెల్లించేది లేదని భీష్మించారు. దీంతో వెయిటర్స్, ధూల్‌పేట్ వాసుల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీయడంతో వెయిటర్స్ కర్రలు, కుర్చీలతో వారిపై దాడి చేశారు. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రాండ్ హోటల్ వెయిటర్స్ దాడి చేస్తున్న సన్నివేశాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఈ విషయమై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందిస్తూ హోటల్ యాజమాన్యంపై, వెయిటర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు వెంటనే హోటల్ యజమానితో పాటు వెయిటర్స్‌ను అరెస్టు చేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. హోటల్‌కు వచ్చిన కస్టమర్లపై దాడులు చేయడం దారుణమన్నారు. పోలీసులు వెంటనే హోటల్‌ను మూసివేయని పక్షంలో తానే రంగంలోకి దిగాల్సి వస్తుందని ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేశారు. హోటల్‌కు వచ్చిన వారిలో మహిళలు కూడా ఉన్నారని వారిపై కూడా వెయిటర్స్ దాడి చేయడం దారుణమన్నారు.

పోలీసుల అదుపులో 10 మంది వెయిటర్స్

ధూల్‌పేట వాసులపై దాడులకు దిగిన 10 మంది వెయిటర్స్‌ను అబిడ్స్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజును వివరణ కోరగా హోటల్ యజమానితో పాటు వెయిటర్స్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుడు సుమిత్ సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హోటల్ యజమానితో పాటు వెయిటర్స్‌పై కూడా కేసులు నమోదు చేశామన్నారు. ముందు జాగ్రత చర్యగా హోటల్‌ను మూసివేశామన్నారు. దర్యాప్తు కొనసాగుతుందని పేర్కొన్నారు.